# స్వర్గంలో రివొల్యూషన్

శ్రీ కోకా సుబ్రమణ్యేశ్వరరావు బి. ఎ.,

అది యే పట్టణమో తెలియకుండా వుంది. గొప్ప గొప్ప స్తంభములు గలిగి యొప్పారుచున్న మహోన్నతమగు భవనాలు, గొప్ప తోట లున్నాయి. నేను ఒక తోటలో తిరుగుతూ దాన్ని చూస్తూన్నాను. దానిలో ఒక దారా జలయంత్రము (Fountain) విహారానికై వచ్చినవాళ్లు కూర్చునడానికి సిమెంటుతో కట్టబడినవి యున్నవి. నేను పోయి ఒకచోట కూర్చున్నాను. ఇంతట్లోకే ఒక పాతికసంవత్సరాల యువకుడు ట్వీడు సూటు, నెక్ టై, కాళ్ళకు బేటాషూస్ (అనుకుంటాను) ధరించియున్నాడు. చేతిలో బేంజో (Banjo) ఉన్నది. ఏదో ఇంగ్లీషులో పాటపాడుతున్నా డనుకొంటాను. నేను కూర్చున్న చోటుపైపువచ్చి నన్ను దాటి వెళ్లిపోబోతున్నాడు. నేను 'ఏమండోయ్ కొంచెంసేపు ఆగండి' అంటూ అతనిని కలుసుకొన్నాను.

'హు ఆర్ యు' అన్నాడు.

'అయ్యా నాకా భాష తెలియదు. తెలుగులో సెలవియ్యండి' అన్నాను.

'నీ వెవరవు? ఇక్కడకు ఏమి పనిమీద వచ్చినావు' అని నన్నడిగినాడు.

'అయ్యా నేను మద్రాసునగరము చూడడానికై వచ్చాను. వచ్చి వింతలు శోభలు చూస్తున్నాను. ఈ పార్కు పే రేమిటండి. పైగా మీ రెవరో మీ పవిత్ర నామధేయ మేదో ఈ దీనుడు తెలిసికొనవచ్చునా' అన్నాను.

'ఇది దేవలోకములోని అమరావతి పట్టణము. మన మున్నది దేవేంద్రుని నందనవనము. ఇది మద్రాసు గాదు. నే నెవరినో చెప్పమన్నావుగదూ, నేను నారదుడిని' అన్నాడు.

'అయ్యా మీ రేమైనా ఆకుల తుంగల, ఘంటసాల ఈలపాట రఘురామయ్య, పారుపల్లివారి లాగ ఏమైనా వేషం వేసేవారా? ఆ చేతిలో వున్నది బేంజో కదండీ.'

'అదేమిటోయ్, అలా మాట్లాడుతావు. నేను వేషాలు వేసే వాన్నికాను. నిజమైన నారదుడినే. నా చేతులో వున్నది బేంజో కాదు. నీ శ్రాద్ధంగాదు. తంబూరా వోయ్.'

'అయ్యా మీరు ఈ ఆకారంతో వున్నారేమిటి. సూటు, క్రాపింగుమీద ఉన్నారే? అదీకాక మీరు ఇంగ్లీషు మాట్లాడుతున్నారు. బాగా చరివారటండీ. మీరు మామూలుగా సినిమాలలో చూచే నారదుడులాగ లేరే. ఇది తంబూరా కాదనుకొంటాను. బేంజో అనుకొంటాను.'

'కాదోయ్. ఇది Improved తంబూరాం ఈ మధ్యం స్వర్గంలోకూడా 17-వ శతాబ్దములో ఇంగ్లాండులో జరిగిన ఇండస్ట్రియల్ రివొల్యూషను లాంటిది. దాని పుణ్యమా అంటూ మేము సుఖపడుతున్నాము. ఇక్కడ కూడా ఒక విశ్వకళాపరిషత్తు పెట్టినారు. దానియందు ఒక సంవత్సరము కష్టపడి చదివి ఈ నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకొన్నాను. మరచేను. నాకు వివాహం త్వరలో కాబోతున్నది.'

'ఓహో. అట్లాగాండీ. బహు సంతోషదాయకమైన మాట సెలవిచ్చేరు. స్వర్గలోకం అంతా తారుమా రయిపోయిం దన్నమాట. నేను ఇచ్చటికి క్రొత్త. కనుక మీతోపాటు నన్ను తీసికొనివెళ్ళి అన్ని సందర్భాలు విషయాలు చూపించి తెలియజెప్పండీ' అన్నాను.

'అట్లా అయితే నాతోకూడా రా' అంటూ నన్ను తనతో తీసికొని పోతున్నాడు. ఇంతట్లోకే నాకు ఒక పెద్ద స్తంభం కనుపించింది.

'అయ్యా అదేమిటండీ. ధ్వజస్తంభమా యేమిటి. దానిపైన ఏదో కాగడా వెలుగుతూ వుంది' అన్నాను.

'అది లైటు హౌసు. భూలోకంనుండి స్వర్గానికి వచ్చేవారికి మార్గం చూపించడానికి కట్టబడింది.'

'ఇంకా అనేక విచిత్రములను చూస్తూ కదలిపోతు

న్నాము. నాకు త్రిమూర్తులని చూడాలనిపించింది. నారదుణ్ణడిగాను. సరేయంటూ ముందు ఒక దివ్య సౌధమువద్దకు తీసికొని మహారాజా గారినగరువలె బహు మంచి ప్లాన్‌మీద కట్టబడివున్నది. లోపలికి ప్రవేశించినాము. అక్కడ ఒకచోట విష్ణుమూర్తి లక్ష్మీదేవి చీట్లపేక ఆడుతూ యున్నారు. విష్ణుదేవుడు బ్లేజిరుకోటు తెల్ల ట్రవుజరు తొడగి, కళాశాల విద్యార్థి సాయంకాలము షీచికి ఎట్లా తయారవుతాడో అట్లా యున్నాడు. కోటుకు ఏదో గురుతు (Badge) యున్నది. లక్ష్మీదేవిగారు రోజ్ గాను వేసికొని కాళ్ళకు హైహీల్స్‌షూస్ తొడగియుంది. పోగానే సెల్యూట్ చేసి వారు ఒక పేముకుర్చీ చూపితే ఆసీనుడయ్యాను. కొంతసేపు వారికి భూలోకపుసంగతులు కొన్ని చెప్పాను. తర్వాత వారు 'Excuse me' అంటూ వాళ్ళిద్దరూ ఒకకారులో వెళ్ళిపోయారు. తర్వాత నారదుడూ నేనూ మిగిలినవారిని చూదామని బయలుదేరాము.

'అయ్యా నారదుడుగారూ వాళ్ళిద్దరూ కారులో ఎక్కడకు వెళ్ళారు? ఆ డ్రైవరు ఎవరండీ. ఆయనకు రెండురెక్కలు వున్నాయి. మరొక సంగతి. విష్ణుదేవుడుగారి కోటుకి ఏదో 'బాడ్జి' తగిలించి వుంది. ఆయన ఏ విశ్వకళాపరిషత్తులోనైనా ఏదైనా డిగ్రీపొందాడా. ఇవన్నీ విపులంగా సెలవియ్యండీ' అన్నాను.

'అబ్బాయ్ వాళ్ళిద్దరూ ఈ దినము ఒకచోట డిన్నరు, నృత్యము యుంటే వెళ్ళారు. మనము బ్రహ్మచారులము. మనల్ని రానియ్యరు. ఆ డ్రైవరు మాటా- అతడు గరుత్మంతుడని తెలియదూ. ఇక విష్ణువు మాటా- ఆయన కోటుకుండేది వైకుంఠం Badge కదూ. ఆయన డిగ్రీ పొందకపోయినా మీ భూలోకపువాళ్లు ఆర్తజన శరణ్యుడనీ, దీనమందారుడనీ, భక్తవత్సలుడనీ, ఇత్యాదివి చాలా ఆనరరీడిగ్రీలను ఆయన చేసే కార్యములకునూ,ఆయన ఇచ్చే వరములకూ బదులుగా ఆయనను ఉచితరీతిగా బహూకరించారు.' అని జవాబిచ్చాడు.

శివుడు బ్రహ్మదేవుడుగార్ల దర్శనముకూడా ఈ విధంగానే జరిగిందని ఒక్కమాటలో చెప్పి వెయ్యొచ్చు. విపులంగా చెపితే మీకు విసుగేస్తుంది. తర్వాత నారదుడిని అడిగాను.

'అయ్యా ఇక్కడకూడా.మ్యూజియం అనీ, అక్వేరియమ్ అనీ, జూ అనీ ఏమైనా తెరచేరాండీ.'

నిస్సందేహంగా. జూలో ఇంద్రుని ఐరావతం, విష్ణుని గరుత్మంతం, శివుడుగారి నందిని, ఇత్యాది వాహనాలను మరికొన్ని మృగాలను ఉంచాము. మ్యూజియంలోనా విష్ణుని శంఖు చక్ర గదాయుధములను బ్రహ్మగారి వేదాలను, శివుడుగారి త్రిశూలాన్ని ఇంద్రుని వజ్రాయుధాన్ని—మరచేను. నా తంబూరాను కూడా—ఇంకా చాలావాటిని యుంచాము. అందుకనేకదూ నాకు క్రొత్తగా improved తంబూరా—నీవు బేంజో అన్నావే—వచ్చింది. ఇక అక్వేరియం మటూ, దాని మాటయింకా తలపెట్టలేదు.' అని నాసందేహాన్ని నిస్సందేహంగా తీర్చేడు.

'మరి ఇక్కడకూడా క్లబ్‌లు, కాఫీ హోటళ్లు, స్పెన్సరుకంపెనీ లాంటివి వున్నాయండీ? ఆటపాటలు, నృత్యాలు జరుగుతుంటాయా?'

'తప్పకుండాను. ఇక్కడ అమృతం F. S. గా ప్రతి వారికి ఇస్తారు. అయితే కాఫీ, టీలు కావాలంటె ఒక కప్పుకు ధర ఎక్కువండోయ్. ఎందుకంటే అవన్నీ భూలోకంలోనుండి ఎగుమతి అయి ఇక్కడకి రావద్దూ. నృత్యానికి రంభా ఊర్వశులున్నారుగా దీని విషయమై పెద్ద చిక్కుండండోయ్ ఇక్కడ డాన్సు అంతా యూరపియన్లమాదిరిదిలెండి. అందుచే వాళ్ళిద్దరితో నృత్యము నేను చెయ్యాలంటే, నేనని ఒకళ్లు ఒకళ్లు పెనుగులాడుతున్నారు. ఆఖరకు మూర్తులు ముగ్గురుకూడా, అయితే వాళ్ళని వదలడానికి దేవేంద్రునికి ఇష్టం లేదు. దాన్ని పరిహరించడానికోసరం ఎలెక్షన్లూ వోటింగులూ అమలులోనికి తెచ్చాము. ఎలెక్షనులో గెలిచారంటే వాళ్ళలో ఒక సంవత్సరం తంటాలేకుండా నృత్యము చెయ్యొచ్చు. ఆ ఎలెక్షనులోకూడా పార్టీలు. విష్ణుపార్టీలనీ, బ్రహ్మదనీ, శివుడుదనీ, ఇంద్రుడునీ, ఇత్యాదివి. పైగా వోట్లను వరాలిచ్చి తమవైపు వేయించుకోవడముకూడా జరుగుతూ వుంటూంది.

'అట్లాగా అండీ. సరే బలే బావుంది. స్వర్గలోకం అంతా భూలోకంలాగా తయారవుతున్న దన్నమాట. ఇమిటేషను డైమండ్సు, ఇమిటేషన్ సిల్కులాగా స్వర్గలోకానికి ఇమిటేషన్ భూలోకం అని పేరు పెట్టాలసి వస్తుందేమో. అయితే దీనినంతా ప్లాను వేసి అమలులోనికి తెచ్చిం దెవరండీ.'

'నేనున్నాగా. కబుర్లపోగునీ, స్వర్గలోకానికి జర్నలిష్టునీ. నాపని అన్నిలోకాలు తిరిగి అక్కడక్కడ సంగతులు తెలిసికొనివచ్చి మూర్తులకు చెప్పడం. వాళ్లు ముగ్గురున్నూ దిక్పాలకులూ భూలోకం అన్నిలోకాలకంటె సివిలైజ్‌డ్‌గావుందనీ,స్వర్గం చాలాప్రిమిటివ్‌గా

వుందనీ ఆలోచించి ఇప్పుడుండే పరిస్థితులను ఆచరణలోనికి తెచ్చారు.'

'దానికి మిమ్ములనందరినీ చాలా అభినందింపవలసినదే. అయితే ఇక్కడకూడా కోర్టులు, వివిధ ఆఫీసులు హైకోర్టులు, ప్రీవికౌన్సిలు, తంతివార్తలు వున్నవన్న మాటేనా? అన్ని వ్యాపారాలు బాగా నిర్విఘ్నముగా సాగుతూవుంటాయా? లేకపోతే స్పెయినులోలాగా, చైనా జపానులలోలాగా ఏమైనా గడబిడలు జరుగుతూ ఉంటాయా?'

'దానికేమి పర్వాలేదు. మంచి పోలీసు సిస్టమ్ పెట్టినాము. ఇక్కడ పాపులేషన్ 33 కోట్ల దేవతలు. ఇదికాక మునులు భూలోకాన్నుంచి ఇక్కడకి వలస వచ్చి ఇక్కడ సెటిల్ అయి యున్నవారు. అందరు కలసి ఇప్పటికి 50 కోట్లు వుంటారు. ప్రతియేటా పాపం పెరిగినట్లు పాపులేషన్ పెరిగిపోతోంది. కాబట్టి ఇక్కడ కూడా **Birth Control** చెయ్యాలసి వస్తోంది. నిరుద్యోగం ఎక్కువయిపోతోంది. దానివల్ల నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేటట్లు తాలూకాబోర్డులు, మరికొన్ని డిపార్ట్మెంటులూ, చాలా పరిశ్రమసంస్థలూ నెలకొల్పుతూ వున్నాము. ఇది మా స్వర్గలోక స్థితి. మీకు బాగా అర్థమయినట్లు లేదని నాకు తోస్తోంది, ఏమంటారు?'

'అబ్బే. ఆలాటిదేమీ లేదండీ. నేనూ మీలాగనే తెలివిగల బుఱ్ఱనే. ఆదంతా ఇప్పుడెందుకులెండి ఏకరువు పెట్టడం. ఎవరైనా వింటే తన్ను తాను పొగడుకొంటున్నాడని అంటారు. ఏదిచేసినా తప్పులెంచుతారు కదండీ మరి మాలోకపువాళ్లు. మరి మీ స్వర్గలోకం సంగతి ఏమో తెలియదు కాని—మీతోకూడా అన్ని ఇమిటేట్ చేసినప్పుడు ఆ గుణముకూడా యుంటుందేమో—అరరే మాటలసందడిలో మరచిపోయాను, మరి మీ పెళ్ళెప్పుడండీ? మరి నాకేమైనా పప్పన్నము దొరుకుతుందా?'

'తప్పకుండాను. నిన్ను పిలువకపోతే మరెవ్వరినను కొన్నావు. పప్పన్నమేమిటి? అంతా యూరపియన్ ఫేషనోయ్, నా పెళ్ళికి మంచిదినాలకోసరం చూస్తున్నాను. ఇప్పుడు నావద్ద డబ్బులేదు. అదీకాకుండా నేను **spend thrift**ని అయిపోయాను. అటుపైని ఈ దేవతలకంతా నాపైన కళ్లు. ఈ బ్రహ్మచారిగాడు మంచి పిల్లను కట్టుకొంటాడని, సరే ఎంగుకులేగాని నీకు టైమైపోతోంది. పెళ్ళికి పత్రిక పంపిస్తాను, తప్పక రాండి. రాకపోతే ఒట్టు సరే నేను సెలవుతీసుకొంటాను. 'గుడ్ బై' అంటూ నాకు వీడ్కోలిచ్చాడు.

★

ఇంక నేను ఇక్కడ చాలకాల ముండగూడదు. మన భూలోకమే అనుకొంటే దాని తాతలాగుంది స్వర్గం. అనుకొంటూ భూలోకానికి వచ్చేస్తూ స్వర్గంలో రివొల్యూషను బలేవుందిరా అని తలపోసుకొంటూ వచ్చాను. రివొల్యూషన్ అనే మాటనే తారకమంత్రంలాగ జపించడం మొదలెట్టాను.

'ఏమిటండోయ్? రివొల్యూష నేమిటి? పదేపదే అంటున్నారు. కలవరిస్తూన్నా రేంటి' అంటూ నా భార్య నన్ను లేపింది. లేచి చూచేసరికి ఎదురుగా నా భార్యామణి మొఖం, ఏడు గంటలుచూపిస్తూ గడియారం కనబడ్డాయి.


## చేతిపనుల వర్తక రహస్యబోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, బాణసంచ అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 200 గలవు. ధర 1 రూపాయి. పోస్టుఖర్చులు 5 అణాలు.

కొక్కోకము

స్త్రీపురుష రహస్యములు 64 చిత్రపటములతో 270 పేజీలుగల పెద్దపుస్తకము. ధర రు 1-0-0. పోస్టుఖర్చు రు. 0-5-0 లు. ఇందులో స్త్రీపురుష శృంగార రహస్యములు. శయ్యాగృహ మర్మములు గలవు.

ముద్దులు మర్మములు

పడకటి ముచ్చటలు, రతిసంబంధమయిన అనేక మర్మవిషయము లిందు గలవు. 8 పటములతో 148 పేజీలుగల పెద్దపుస్తకము. ధర రు. 0-8-0. పోస్టుఖర్చులు 0-5-0. కొక్కోకము, ముద్దులు మర్మములు ఒకేదఫా రెండుకొనిన పోస్టుఖర్చులతో రు. 1-12-0.

మహారాజ పుస్తకశాల,

అరుణాచల మొదలివీధి, 18 బీటు; మద్రాసు.

(6 పేజి తరువాయి)

లందఱూ వారి గౌరవార్థమై సన్మానసభ జరుపుచున్నారు.

జగ-: అబ్బబ్బా! మీ లాంగ్వేజీ, మీ ప్రోనౌన్సేషనూ వింటూవుంటే గుండె లదిరిపోతున్నాయి.

పర-' ఇలా గాక చవట భాషా, చచ్చు సమాసాలూ వాడడం నాజన్మేపీ లేదు.

జగ-: మొన్నొక శాస్త్రిలుగారిలాగే రైల్వేస్టేషన్ అంటే ఏదో చెప్పారు.

పర-' ధూమశకట విశ్రాంతి నిలయం ' అన్నారా?

జగ-: ఎగ్జాక్ట్లీ. ఇదే సేమ్ వర్డ్లండి. దానికే నేను డంగై పోయాను. కాని ఇది దాని గ్రాండ్ ఫాదర్ గా వుంది.

పర-' అవును. ఈలాంటివారు అక్కడక్కడా వెయ్యింటికొక్కడైనా వుండబట్టే ఈయాంధ్రమూ, ఈ సంస్కృతమూ ఇంకా కొంచెం కొనవూపిరితోనైనా వున్నాయి. లేకుంటే అన్నీ ఆ యాంగ్ల సముద్రంలో అంతర్ధానమైపోయ్యేవే.

జగ-: మా ఫాదర్ కుగూడా స్యాన్స్క్రిట్ అంటే చాలా సరదా. నాకు ఫస్టుఫారంలో అదేం చెప్పించారు.

పర-' కాని నీ బుఱ్ఱలో మాత్రం ఏమీ ఎక్కివుండదనుకొంటాను.

జగ-: ఎక్కకేమి నాక్లాసులో ఎప్పుడూ నేను సెకండ్.

పర-' మీ తరగతిలో విద్యార్థు లెంతమంది?

జగ-' ఇద్దఱము.

పర-' భేష్! ఇద్దఱిలో నీవు రెండవ వాడ వన్నమాట. చాలా మెచ్చుకోదగ్గ విషయమే. ఇంతకూ సభావిషయం తెలిసినదా?

జగ-: హైస్కూల్ హెడ్ మాస్టర్ గారికి ఫేర్ వెల్ అడ్రస్ ఇస్తున్నారు. అంతేనా?

పర-' మొదలూ చివరా వదలిపెట్టి నాసందర్భాన్ని బట్టి కొంత గ్రహించావు.

జగ-: ఆంధ్రయూనివర్సిటీ కాలేజీలో చదివానుగదా? అంతమాత్రం గ్రహింపలేకపోతానా?

పర-' ఓహో! చాల గొప్పగా చెప్పుకొంటున్నావు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో అసలు మినహాయింపని నీకు తెలియదు గాబోలు. అది వట్టి నేతిబీరకాయ. ఇతర విశ్వ విద్యాలయాల్లో దేశభాషకు ప్రాధాన్యం ఇస్తారు. ఇక్కడ దానికి ముందు "వి" చేరుస్తారు. ఇంతే భేదం. కలకత్తా విశ్వవిద్యాలయ స్నాతకోపన్యాసముగూడ వంగభాషలో యిచ్చాడు రవీంద్ర కవీంద్రుడు. ఇక్కడ తుట్టతుదకు ఉత్తరాలు గూడా ఇంగ్లీషులోనే ఏడిస్తే గాని త్వరగా ప్రత్యుత్తరం రాదు. తెలుగంటే తెగులైపోయింది. ఆంధ్రత్వం అంధత్వంగా మారింది.

జగ-: మీ రెప్పుడూ ఇల్లుకదలరు గాబట్టి యిలా మాట్లాడుతున్నారు. ఒక్కసారి ఫారెన్ కంట్రీకి వెళ్లివస్తే మీకు కొంచెం కామన్ సెన్సు, జనరల్ నాలెడ్జి కలుగుతుంది.

పర-' వద్దు నాయనా వద్దు వెళ్ళివచ్చిన నీబోటి వారి వల్లనే దేశమంతా పాడైపోతూవుంది. ఆ దౌర్భాగ్యం నాకు గూడా పట్టాలీ? మొన్న ఒకడు లండన్ లో చదువుతూ తండ్రికి తెలుగులో లేఖ వ్రాసినాడు. వక్కణం ఏమి పెట్టినాడో తెలుసునా?

జగ-: లండన్ లో చదువుతూ మదర్ లాంగ్వేజిలో లెటర్ గూడా వ్రాశాడుగా?

పర-' ఓహో నీ కదీగూడా చేతగాదన్న మాట.

జగ-: అబ్బే! ఆ స్టేజీకి పోయినతర్వాత ఇంకా తెలుగేమిటండీ. ఏలా వ్రాయగలిగాడు. అసలా బుద్ధి ఏలాపుట్టింది. ఇదే నాకు చాలా వండర్ ఫుల్ గా వుంది. ఏమని అడ్రెస్ చేశాడో చెప్పండి.

పర-' కీర్తి శేషులైన మా నాయనగారికి అని వ్రాసినాడు.

జగ-: వెరి గుడ్. ఎక్సలెంటైన వర్డు యూస్ చేశాడు. దీనిలో మిస్టేకేముందండి?

పర-' తప్పేమీ లేదు. బ్రతికి బాగా వున్నవాణ్ణి చచ్చినవాణ్ణిగా చేసినాడు. ఇంతే కొడుకు చదువు తండ్రి చావుకు కారణమైనది.

జగ-: తెలుగున్యూస్ పేపర్సులో ఈ వర్డు ఎక్కువగా కనపడుతుంటే చాలా మంచి దనుకొన్నాను నేను గూడా. అట్లయితే మన ఇండియన్ లాంగ్వేజీస్ లో గూడా చాలా సీక్రెట్సు వున్నాయన్నమాట.

పర-' ఉన్నయ్యో లేవో ఎవడికి గావాలి? చెబుతామన్న వినేవాడెవడు?

జగ-: అలా గయితే షేక్స్పియర్, షెల్లీ, స్కాట్, బైరన్, వర్డ్సువర్త్ లాంటి పొయట్సు వీరిలో వున్నారా?

పర-' నీ బోటివారి కందఱికీ పొరుగింటి పుల్లగూర రుచి. విదేశముల పేర్లన్నీ చచ్చీ చెడీ కంఠస్థంచేసి భగవద్గీతలాగా పారాయణం చేస్తూవుంటారు. ఈలాటివాండ్ల

కు సంస్కృతాంధ్ర కవుల పావన నామధేయములు చెప్పి నా ప్రయోజనం లేదు.

జగ-: పోనీయండి. అసల్ సబ్జక్టు వదలి అగాధంలో పడుతున్నాం. ఆ హెడ్ మాస్టర్ గారి హిస్టరీ మీ కేమైనా తెలుసునా?

పర-' నాకు తెలియడ మేమిటి? ఆంధ్రదేశంలో అనేకమందికి తెలియును.

జగ-: జనరల్ గా ఆయన్ని గురించి జనుల ఒపీనియన్ ఏలా వుంటుంది?

పర-' నీవు బొత్తుగా వెఱ్ఱిబాగులవాడవుగా వున్నావు. ముంజేతి కంకణమున కద్దమేల? నీ ప్రశ్నకు ఆసభయే సమాధానము.

జగ-: ఈ డేస్‌లో మీటింగుల కేమి కొరత?

పర-' నీ వింకా పెరటిదారినే వున్నావు. "అధికారాంతమునందు చూడవలదా ఆయయ్య సౌభాగ్యముల్" అన్నట్లు ఉద్యోగములో వున్నప్పుడు గాక విరమించేటప్పుడు అంత గొప్ప సన్మాన సభచేయడం అభినందించడం చూస్తే ప్రజలకు వారియందుండే గౌరవభావం తెలియడం లేదా?

జగ-: ఈయన విషయంలో సుపీరియర్ ఆఫీసర్సు ఏలా వుంటారో మీకు తెలుసునా?

పర-' మండల విద్యాధికారి మొదలు రాష్ట్రాధిపతి యగు గవర్నర్ వఱకూ ఇక్కడకు వచ్చిన వారిలో వీరిని ప్రశంసింపనివారే లేరు.

జగ-: వట్టిమాటలతో లాభంలేదు. రిటెన్ గా వుంటేనే యీ డేస్‌లో వ్యాల్యూ.

పర-' అసల్లో సరుకులేని వాని కేవిధంగానూ విలువ వుండదు. అంధునికి శ్రేష్ఠమైన సులోచనం పెడితే మాత్రము అందం వస్తుందా?

జగ-: సర్టిఫికెట్సు లేవని చెప్పలేక ఏవో అర్థంగాని వుపమానాలు చెపుతున్నారు.

పర-' అసలు మానమంటే ఏమిటో అర్థమైతేగదూ ఉపమానం అర్థంగావడానికి.

జగ-: మీ చాదస్తం చాలించి నే నడిగినదానికి రిప్లై యివ్వండి.

పర-' అదిగో నీ బుద్ధి బయటపడినది. "మూఢో మూర్ఖో గార్దభశ్చైకరాశిః" అన్నట్లు మీదంతా ఒక రాశి. అందులోనూ నీవు తెలిసీ తెలియని వాడవు. నేతి డబ్బాను అడుగున బెజ్జంవుంటే అడుగుననే తగ్గవలెగాని పై భాగమున ఎందుకు తగ్గవలె అనేబాప్తు. ఇందువల్లనే 'తెలిసియు తెలియని నరు దెల్ప బ్రహ్మదేవుని వశమే' అన్నారు పెద్దలు. నీవు మహా ప్రజ్ఞావంతుడవూ నేను చాదస్తుడనా? ఇట్లా సారకాయకోతలు కోసేవా రెంత మందో నాదగ్గరపరాభవం పొందిపోయినారు. నీ వేమిటి లెక్క. 'మహాగజాః పలాయంతే మశకానాంతు కాగతిః'.

జగ-: సార్. కోపపడక ఎక్స్క్యూస్ చెయ్యండి. మీ కిష్టముంటే చెప్పండి. లేకుంటే మానండి. నా దారిని నేను వెళ్తాను.

పర-' తొందరపడకు. వారికివచ్చిన యోగ్యతాపత్రాలు ముద్రిస్తే మరల ఒక మహాభారతమంత గ్రంథం తయారౌతుంది. అవి గూడా అయాచితంగా యిచ్చినవిగాని వీరిలాగా ఉపాహారాలతో, విందులతో వినోదాలతో వారిపై పెచ్చు గుప్తదానాలతో సంతోషపెట్టి వెంట తిరిగి వేధించి సంపాదించినవి కావు. వాటిమీద ఆయనకు లక్ష్యంగూడా లేదు.

జగ-: అయితే వారి లక్ష్యం దేనిమీద వుంటుంది.

పర-' విద్యార్థుల కమూల్యములైన విషయాలు బోధించివారిని ఉన్నత స్థితికి తీసుకరావడమే వారి ఆదర్శం.

జగ-: ఆల్ రైట్. సరేగాని మీకు ఇంగ్లీషు భాషంటే నేగిట్టదే. ఇంగ్లీషుచదివిన ఆయన్ని గురించి అంత ప్లీజవుతున్నారేమి? ఆయనకు మీకు రిలేషన్షిప్పేమైన వుందా?

పర-' గిట్టదన్న వెధవెవడు. ఒక్క ఇంగ్లీషే కాదు. తెలివి తేటలూ, సత్తా, వుంటే ఇరవై నాలుగు భాషలు నేర్చుకో ఎవడు వద్దన్నాడు. స్వజాతీయమైన వేషమూ, భాషా, సాంప్రదాయమూ, వీటికి మాత్రం మంగళం పాడవద్దని నా మతం.

జగ-: ఆయన ఇవన్నీ పాటించడంవుందా?

పర-' పాటిస్తారో లేదో వారి సంగతి మీకేం తెలుసును?

జగ-: తెలియకేగా అడుగుతా.

పర-' వారికి మాతృభాష యగు తెనుగంటే ఎంతో అభిమానం. తెనుగు పండితులంటే మిక్కిలి గౌరవం, తెనుగు కవిత్వమంటే పట్టరాని సంతోషం. తెనుగు దేశములో సుప్రసిద్ధులైన కొక్కొండ వెంకటరత్నం పంతులు, కూచి నరసింహం పంతులుగార్ల శుశ్రూష చేసి తెలుగు కావ్యాలు క్షుణ్ణంగా చదివి ఆరితేరిన చేయి.

ఇంతేగాక సంగీతం, ఆయుర్వేదం, మంత్రశాస్త్రం మొదలైన వానిలో గూడ మంచి జ్ఞానం ఉన్నది.

జగ-ఃమీమాటలనుబట్టి ఆయనకు తెలియనివిషయామే లేనట్లుంది.

పర-'ఎందుకు లేవు? అవిగూడ చాలా వున్నవి. చెప్తాను విను. పై అధికారిని చూడగానే గడగడ వడకుచూ వంగి వంగి సలాములు చేస్తూ చేతులు నలుపుకొంటూ వుండడం తెలియదు. దున్న యీనినదంటే దూడను గట్టి వేయరా అన్నట్లు మంచి చెడ్డలు విచారించకుండా మాట్లాడడం తెలియదు. ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంతో ఎదుర్కోవడమేగాని వాటికి లొంగిపోయి కంగారు పడడం తెలియదు. ఏ వ్యక్తియందైనా గుణమును గ్రహించి సంతోషించడమే గాని రంధ్రాన్వేషణం చేతగాదు. ఇతరుల మెప్పుకోలుకు ఇచ్చకాలాడడం చేతగాదు. స్వసాంప్రదాయానికి స్వస్తి చెప్పి నీ బోంట్లవలె వెఱ్ఱి మొఱ్ఱి వేషాలు వేయడం చేతగాదు.

జగ-ఃనన్ను తిస్తే తిట్టారుగాని మీ హెడ్ మాస్టర్ గారి హిస్టరీవల్ల వండర్‌ఫుల్‌గా వున్న మీ స్పీచ్ వల్ల నాకు చాలా సంతోషమయింది. మంచి స్పీచ్ చేశారు.

పర-'అవును మూఢులతో సంభాషణముకంటె పండితులతో వివాదము మేలు. బెస్తవానిని కౌగలించుకోవడం కంటె అత్తరు సాహేబుచేత చెంపదెబ్బ తినడం శ్రేష్ఠం కాదూ?

జగ-ః చిత్తం. మీకు చాలా ట్రబుల్ ఇచ్చాను. మెనిమెని థ్యాంక్సు. సెలవీయండి. వెళ్తాను.

పర-' ఎక్కడకు? ఆ సభకేనా?

జగ-ఃనో, నో, ఇన్నిమాటలూ విని, ఇన్ని తిట్లూతిని, ఈ ప్యాషన్‌తో అక్కడికి పోవడంకూడానా? పైగా పిలవని పేరంటంగూడా...ఆకలి అవుతుంది. ఏ కాఫీ హోటల్‌కైనా వెళ్తాను (పర్సు చూచుకొని) పర్సుకూడా ఖాళీగావుంది ఎక్కడైనా బిల్సుకే ట్రైచేసి చూస్తాను.

పర-' ఈ వికారంతో వెళ్ళితే అనీగూడా సున్నే. అచ్చమైన ఆంధ్ర వేషంతో వెళ్ళినావంటే భోజనం దొరుకుతుంది.

జగ-ః యస్ ఆలాగే చేస్తాను సార్. గుడీవినింగ్. దయవుంచండి. (వెళ్లును).

పర-' ఇన్ని చెప్పినా తుదకు నమస్కారం అనలేకపోయినావు. వెళ్లు, ఈ జన్మకికనింతేలే.


కేసరి పుష్పత్రయము

మాలతి

ఇది బాదంపప్పుపాలనుండి తయారుచేయబడిన యొక తెల్లటి సువాసనగల నవనీతమువంటిది. దీనిని తలదువ్వుకొనుటకు ముందు కొద్దిగ రాచుకొని దువ్వుకొనిన వెంట్రుకలు రేగక పట్టుకుచ్చువలె మిసమిసలాడుచుండును. మెదడు చల్లబడి నిద్ర వచ్చును. ఇందు మాలతీపుష్పముల అత్తరు చేరియున్నది. ఈ అత్తరు సుఖమైన సువాసనకు పేరుగాంచినది.

వెల బుడ్డి 1-కి 8 అణాలు

మాధవి

ఇది పుష్పసారములతో నిండియుండు ఒక నాజూకైన మంచువంటి పరిమళపదార్థము. కొద్దిగ వ్రేలితో తీసికొని ముఖమునకు లేపనము చేసికొనిన వెంటనే అది చర్మములో మాయమై ముఖమునకు కళ, కాంతి నిచ్చును. ముఖమున లేచు సొబె, మచ్చలు, మొటిమలు మొదలగువాటిని మాన్పును.

వెల బుడ్డి 1-కి 8 అణాలు

మల్లిక

ఇది ముద్దుబిడ్డలకు మురిపమైన లేపము. ఇది మైసూరు చందన అత్తరుతోను మల్లెమొగ్గల సారముతోను తయారుచేయబడిన నవీన నవనీతము. శిశువులకు దీనిని ప్రతిదినము స్నానానంతరము కొద్దిగ శరీరమునకు రాచుచుండిన చర్మము మృదువై బంగారురంగు నిచ్చి చర్మవ్యాధుల రాకుండచేయును. ఈ లేపము వలన బిడ్డలు రబ్బరు చెండ్లవలె తేరుదురు.

వెల బుడ్డి 1-కి 8 అణాలు

కేసరికుటీరం

రాయపేట : : మద్రాసు.